క్లుప్తంగా

క్యాంటీన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సూచనలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో మహిళా శక్తి క్యాంటీన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీఆర్‌డీవో కిషన్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో ఆఫీస్‌ను బుధవారం సందర్శించి పనుల వివరాలు ఎంపీడీవో రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం లలితకుమారి, ఈజీఎస్ ఏపీవో రజియాసుల్తానా, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు



రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కాసిపేట: మండలంలోని దేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం గిరిజన పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆర్‌బీఎస్‌కే బృందం, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు గుర్రాల రాజవేణు కోరారు. గురుకుల పాఠశాలలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. మహాధర్నా కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద మొత్తంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

జన్నారం: మండలకేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాల ప్రాంగణం, వంటగది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ అందిస్తున్న విధానం విద్యార్థులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంపీవో జలేందర్, ఈవో రాహుల్, పాఠశాల హెచ్‌ఎం శివరామరాజు, సిబ్బంది ఉన్నారు.

నగదు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

జన్నారం: వృద్ధురాలి నుంచి నగదు ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రెండవ ఎస్సై తానాజీ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ముదేళ్ల భూమక్క అనే వృద్ధురాలు ఈనెల 24న బ్యాంకులో రూ.10 వేలు డ్రా చేయగా, బ్యాంకు ముందర ఖమ్మం జిల్లా మధిర మండలానికి చెందిన కుంభంపాటి యేసాబ్ అలియాస్ సురేశ్ రెడ్డి అనే వ్యక్తి నగదు లాక్కెళ్లాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి దగ్గర డబ్బులు రికవరీ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత శిక్షణ

నస్పూర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, హౌజ్‌వైరింగ్, ప్లంబింగ్ అండ్ సానిటేషన్ విభాగాల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అకాడమీ ఇన్‌చార్జి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 83285 07232, 87904 14049 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో దండేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల పీడీ సూరం రవి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు హర్షవర్ధన్, సృజన్, శ్రీనాథ్‌లను హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు బుధవారం పాఠశాలలో అభినందించారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

- నివాళులర్పించిన బీజేపీ శ్రేణులు



మంచిర్యాలటౌన్: నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/చెన్నూర్/మందమర్రి(రామకృష్ణాపూర్): జనసంఘ్ వ్యవస్థాపకుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతంతో ప్రభుత్వం అందించే ఫలాలు చిట్టచివరి వ్యక్తికి అందాలనే ఉద్దేశంతో పనిచేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తుందని తెలిపారు. పలు చోట్ల బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, పురుషోత్తం జాజు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, కర్రె లచ్చన్న, బింగి ప్రవీణ్, అమిరిశెట్టి రాజు, పల్లి రాకేశ్, ముదాం మల్లేశ్, రెడ్డిమల్ల అశోక్, బొలిశెట్టి అశ్విన్, చిరంజీవి, విజయ్, తాండూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, హాజీపూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి, బెల్లంపల్లిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, బూత్ అధ్యక్షుడు రాములు, చెన్నూర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు గర్రెపల్లి వెంకట నర్సయ్య, కేవీఎం శ్రీనివాస్, తుమ్మ శ్రీపాల్, అడుప మల్లికార్జున్, శ్రీనివాస్, మద్ద మధూకర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో...

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- డీఎల్‌పీవో ధర్మారాణి



కార్యదర్శికి సూచనలు ఇస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి

కోటపల్లి: అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి సూచించారు. మండలకేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డ్రెయినేజీలు పరిశీలించి మురుగునీరు సక్రమంగా పారేలా నిరంతరం చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీరోజూ ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో చెత్త సేకరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ

భీమారం: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో ధర్మారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం గ్రామపంచాయతీ ద్వారా చేపట్టిన పారిశుధ్య పనులను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రతీవారం గ్రామాల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి కృష్ణమూర్తికి పలుసూచనలు చేశారు.

‘అభివృద్ధిని ఓర్వలేకనే ఎమ్మెల్యేపై ఆరోపణలు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్‌లు మాట్లాడుతూ.. మంచిర్యాలలో అభివృద్ధి చేస్తున్న తమ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తప్పుడు ప్రచారం చేస్తే, వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. కాప్రా స్థలంపై వాస్తవాలను తెలుసుకోవాలని, స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని, కోర్టు తీర్పు కూడా ఎమ్మెల్యే పక్షాన వచ్చిందని తెలిసినా, ఇలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

విద్యుత్ స్తంభం ధ్వంసం

- కనెక్షన్ కట్ చేసినందుకు ఇంటి యజమాని ప్రతీకారం



ధ్వంసమైన విద్యుత్ స్తంభం కింది భాగం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌లో ఆకుదారి వెంకటేశ్ ఇంటికి రెండు మీటర్లు ఉన్నాయి. కొద్ది నెలలుగా విద్యుత్ బిల్లులు కట్టడం లేదు. రెండు మీటర్లకు కలిపి సుమారు రూ.12,400 వరకు బకాయి ఉంది. చాలా సార్లు విద్యుత్‌శాఖ సిబ్బంది బిల్లు కట్టాలని చెప్పినా కట్టలేదు. దీంతో బుధవారం అధికారులు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు. కోపోద్రిక్తుడైన వెంకటేశ్ గొడ్డలితో ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం కింది భాగాన్ని ధ్వంసం చేశాడు. ప్రస్తుతం అందులో ఇనుప రాడ్లపై స్తంభం నిలిచి ఉంది. వెంటనే సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి, ఎందుకు ఈ పని చేశావంటే నా కరెంట్ కట్ చేస్తారా అందుకే ఇలా చేశానని వారినే బెదిరించారు. స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో తాత్కాలికంగా విద్యుత్ సిబ్బంది దానికి సపోర్టులు ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

‘ఎస్సీ జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలి’

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలుతోపాటు జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలని డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా నాయకులు మేదరి దేవరం, రెడ్డి రమణ, దుర్గం దేవదాస్, పొనగంటి యేసేవు, జాడి దుర్గప్రసాద్, రామ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భీమారం: మండల విద్యాధికారిగా కే.సురేశ్ బుధవా రం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నర్సింగాపూర్ జెడ్పీ పాఠశాల హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న సురేశ్‌ను భీమారం ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. భీమారం హెడ్మాస్టర్ విక్రమ్‌తో పాటు ఉపాధ్యాయులు ఎంఈవోని సన్మానించారు.

జైపూర్ ఎంఈవోగా శ్రీనివాస్

జైపూర్: మండల విద్యాశాఖ అధికారిగా బి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

వేమనపల్లి ఎంఈఓగా శ్రీధర్‌రెడ్డి

వేమనపల్లి: వేమనపల్లి జెడ్పీఎస్ఎస్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బి.శ్రీధర్‌రెడ్డి ఎంఈవోగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

కాసిపేట విద్యాధికారిగా వెంకటేశ్వరస్వామి

కాసిపేట: మండల విద్యాధికారిగా ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరస్వామిని నియమించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.



విద్యార్థుల మానవహారం

నస్పూర్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తీగల్‌పహడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం మానవహారం, స్వచ్ఛతా ప్రతి జ్ఞ నిర్వహించారు. విద్యార్థులకు ఎస్సై రైటింగ్, డ్రాయింగ్, పెయింటింగ్, పోస్టర్స్ మేకింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు.

■ బొగ్గుబాయి వార్తలు

వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభం రూ.4,701కోట్ల నుంచి 33శాతం కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట బుధవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు రవీందర్, రాజశేఖర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేసే ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు వైవీ రావు, కే వీరభద్రయ్య బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై జరిగిన ఈపీ ఆపరేటర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈపీ ఆపరేటర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి రామచందర్, రాచర్ల చంద్రమోహన్, మోతె లచ్చన్న, భద్రి బుచ్చన్న, అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కేకే-5 గని సందర్శన

మందమర్రిరూరల్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేధించాలని కేకే-5 గని ఉద్యోగులకు సేఫ్టీ (కార్పోరేట్) జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిని బుధవారం సందర్శించి గనిలో పని స్థలాలను పరిశీలించారు.


‘ఇచ్చేది 17 శాతమే..’

శ్రీరాంపూర్: కంపెనీ సాధించిన వాస్తవ లాభాల ప్రకారం ఇప్పుడు ఇచ్చే లాభాల వాటా 17 శాతం మాత్రమేనని టీబీజీకేఎస్ నాయకులు ఆరోపించారు. వాస్తవ లాభాలు, అందులో వాటాపై యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు పోగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, సాదుల భాస్కర్, గొర్ల సంతోష తదితరులు పాల్గొన్నారు.

‘మొత్తం లాభాల్లోని వాటా చెల్లించాలి’

నస్పూర్: గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ సాధించిన మొత్తం లాభాల్లో నుంచి 33 శాతం వాటాను కార్మికులకు బోనస్‌గా చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థకు రూ.4701 కోట్లు లాభాలు రాగా దానిలో నుండి 33 శాతం సుమారు రూ.1550 కోట్లు కార్మికులకు బోనస్‌గా చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం కార్మికులను మభ్యపెట్టి కేవలం రూ.790 కోట్లను మాత్రమే కార్మికులకు చెల్లిస్తామని ప్రకటించడం కార్మికులను ద్రోహం చేయడమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పొన్న వేణ సధానందం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిసెట్టి అశ్విన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్

దండేపల్లి: డిసెంబర్‌లో నిర్వహించే జాతీయసాధన సర్వే (న్యాస్)లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని దండేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్ గౌడ్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. జాతీయ సాధన సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే పాఠశాలల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయన్నారు. కాంప్లెక్స్ కార్యదర్శి మనోహర్, రిసోర్స్‌పర్సన్స్ బి.రాజన్న, పి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కాసిపేట: మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మండలంలోని ధర్మరావుపేటలో ఇటీవల మృతి చెందిన జంగిల్ రమేశ్, మక్కల వెంకటేశ్, కొమురయ్య కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎటువంటి సమస్యలు వచ్చినా కుటుంబాలకు అండగా ఉండి, ఆదుకుంటామని అధైర్య పడొద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు రత్నం ప్రదీప్, మైదం రమేష్, సిద్ధం తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, నస్పూరి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ పునరుద్ధరణకు కృషి



సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, సభ్యులు

తాండూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ పున:రుద్ధరణకు కృషి చేస్తున్నట్లు తాండూర్ మండల సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా 510మంది రైతులకు పంట రుణాలు ఇవ్వగా, 221మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. మిగితా రైతులకు కూడా రుణమాఫీ చేయడానికి ఉన్నతాధికారులకు నివేధికలు పంపిస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో సింగిల్ విండో వైస్‌చైర్మన్ రత్నాకర్‌రావు, డైరెక్టర్లు గట్టు మురళీధర్‌రావు, తిరుపతి, సంతోష్‌కుమార్, రాజన్న, పార్వతి సత్తమ్మ, రవూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత



ప్లాస్టిక్, చెత్తను సేకరించిన అటవీ అధికారులు

కాసిపేట: తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట మండలాల శివారు ప్రాంతం బుగ్గ ఆలయ పరిసరాల్లో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ‘పచ్చదనం-పరిశుభ్రత’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్ర అధికారి పూర్ణచందర్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రవీణ్‌నాయక్, గౌరీ శంకర్, తిరుపతి, సతీశ్, ప్రభాకర్, ఎఫ్‌బీవోలు యుగేందర్, కుమారస్వామి, శంకర్‌రాజు, శ్రీధర్, గోపి తదితరులున్నారు.

సిమెంట్ వ్యాపారంలో భారతి సిమెంట్ అగ్రగామి

- అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్
- భారతీ సిమెంట్ సంస్థ మేనేజర్ నాగేశ్వర్‌రావు



బీమా పత్రాలు అందజేస్తున్న ఇంజనీర్ సాగర్‌రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అగ్రభాగాన ఉందని, ఈ క్రమంలో భారతి సిమెంట్ అల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణ విడుదల చేసిందని, భారతి సిమెంట్ వ్యాపారసంస్థ మేనేజర్ వి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డిలు తెలిపారు. హాజీపూర్ మండలం గుడిపేటలోని కేవీఆర్ ఎంటర్‌ప్రైజెస్‌లో బుధవారం తాపీ మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా పిల్లర్లు, స్లాబ్‌లు, బ్రిడ్జిలు, రహదారులకు భారతి సిమెంట్ అల్ట్రాఫస్ట్ సిమెంట్ ఎంపిక ఎంతో కీలకమైందన్నారు. జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబ్‌తో తయారు చేసిన సిమెంట్ ట్యాంపరింగ్ ప్రూఫ్ బ్యాగ్‌లలో లభ్యమవుతుందన్నారు. వినియోగదారులకు ఇంటి నిర్మాణ సమయంలో మీ వద్దకు వచ్చి నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు ఉచిత సాంకేతిక సాయం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా 60మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ గల ఉచిత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల మార్కెటింగ్ అధికారి రాజేష్, డీలర్ ఫణి తేజ, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కలెక్టర్‌కు వినతి

భీమారం: మండల కేంద్రంలో మంజూరైన మినీస్టేడియం పనులను సత్వరమే ప్రారంభించాలని మండల కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్ బృందం బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చొరువతో మినీ స్టేడియం మంజూరైందని, అయితే రెవెన్యూ శాఖ 138సర్వే నంబర్‌లో 5ఎకరాల భూమిని కేటాయించినట్లు ప్రకటించారని, ఇప్పటివరకు స్టేడియానికి భూమి పత్రాలు అప్పగించలేదన్నారు. కలిసిన వారిలో నాయకులు సూరం శ్యాం సుందర్, బూనేని సుదాకర్‌లు ఉన్నారు.

బతుకమ్మ ప్రాంగణాలు శుభ్రం చేయాలి

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో గల బతుకమ్మ ప్రాంగణాలను వెంటనే శుభ్రం చేయాలని పలు కాలనీవాసులు బుధవారం మున్సిపల్ ఆఫీస్‌లో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. బతుకమ్మ ప్రాంగణాల వద్ద విద్యుత్ దీపాలు అమర్చాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని కోరారు.

కుక్కలను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: పట్టణంలో కుక్కలను అత్యంత దారుణంగా హతమార్చిన మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మంచిర్యాల పట్టణానికి చెందిన ఎన్‌జీవో సభ్యులు గౌతమ్ వేరువేరుగా చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూగజీవాలను చంపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌జీవో సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చీరల పంపిణీ

దండేపల్లి: కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బతుకమ్మ కానుకగా, మంచిర్యాల నియోజకవర్గ ఆడపడుచులకు అందిస్తున్న చీరలను దండేపల్లి మండలంలోని లక్ష్మీకాంతపూర్, పెద్దపేట, ధర్మారావుపేట్, ద్వారక, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ గ్రామాల్లో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బంధువులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసులు బుధవారం ‘యువత- మంచి భవిత’ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సై శ్వేత విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు.

దొడేపల్లిలో పర్యటన

లక్సెట్టిపేట: మండలంలోని దొడేపల్లిలో కొద్ది రోజుల నుంచి సీపీఐ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరసనలకు వెటర్నరీ జేడీ శంకర్ స్పందించి బుధవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, బోర్‌వేల్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలపైన అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీపీఐ నాయకులు రమణ రెడ్డి, దేవవరం పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు బీమా

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తించే మల్టీపర్పస్ వర్కర్స్(ఏంపీడబ్ల్యూ)లకు రూ.549 చొప్పున చెల్లించి బీమా చేయించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూ వర్కర్లు, పోస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘విద్యార్థుల ప్రతిజ్ఞ’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ పొగాకు వ్యతిరేక ఉద్యమంలో యువత భాగస్వామ్యం-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చైతన్యం చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.